
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025



ఎస్వీయూ న్యాయవిద్య డీన్‌గా మురళీధర్



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాల న్యాయవిద్య కోర్సు కు, రెండు సంవత్సరాల పిజి న్యాయవిద్య కోర్సులకు ఇన్చార్జ్ అకడమిక్ డీన్ గా ఆచార్య మురళీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్వీయూ ఇంచార్జ్ ఉపకులపతి పరిపాలన భవనం నుంచి ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. ఇప్పటివరకు హానరరీ డీన్ గా పనిచేసిన విశ్రాంత న్యాయ విభాగం ఆచార్యులు వీఆర్సీ కృష్ణయ్యను వెంటనే విధుల నుంచి రిలీవ్ చేసి, నూతనంగా పొలిటికల్ సైన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల డీన్ ఆచార్య బిబి మురళీధర్ ను నియమించారు. ఆచార్య బిబి మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన కరిక్యులం లోని అంశాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తామన్నారు.





పూల రైతుకు..
లాభాల 'పరిమళం'
'శివరాత్రి'కి శివమెత్తిన 'ధరలు'

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పూల రైతులకు పండగ వచ్చిందంటే చాలు వారి సంతోషానికి హద్దు ఉండదు.. పూల ధరలు రెట్టింపు ధరలు పలకడంతో 'సీజనల్' వ్యాపారమైనా పెద్దమొత్తంలో లాభాలొస్తాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని పది రోజులుగా పూల ధరలు ఆకాశంలో 'శివతాండవం' చేస్తున్నాయి. పూల రైతులు, దళారులు, వ్యాపారులు అనేది పూల మండీ వరకూ దొంతర ఉంటుంది. మండీల నుంచి గంపల్లోనూ, తట్టల్లోనూ అమ్ముకునే చిరువ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. పూలను కవరుల్లో కిలోల లెక్కన, మాల కట్టి మూరల లెక్కన అమ్ముతుంటారు. రైతు దగ్గర పూలు 10 రూపాయలు అమ్మితే, అవే పూలు మాల కట్టి పండుగల సీజన్లో మూర రూ.50 పైనే అమ్ముడవుతుంది. పండగ సీజన్‌లో పూల రైతుల నుంచి చిరు వ్యాపారుల వరకూ ఒకింత లాభాలను చవి చూస్తారు.

పిచ్చాటూరు అంటేనే పూల తోటలకు ప్రత్యేకత.. మండలంలో 300 ఎకరాల్లో పూలు సాగు ఉంది. దాదాపు 800 కుటుంబాలు ఈ పూలపైనే ఆధారపడి జీవిస్తుంటారు. శివరాత్రి సందర్భంగా కనకాంబరం, మల్లిపూలు కిలో ధర రూ.700 పలుకుతుండటం గమనార్హం. గతంలో వరి, వేరుశనగ, చెరకు సాగు చేసి నష్టపోయిన కొంతమంది రైతులు, ఉన్న పొలంలో అర ఎకరా, పావు ఎకరాల్లో పూల సాగు ప్రారంభించి పండుగ సీజన్లలో రోజుకు రూ.1000-3000 పైనే సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. మల్లి, కాగడాలు, గులాబి, సంపంగి, కనకాంబరం పూలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. పిచ్చాటూరు, అడవికండ్రిగ, మూడియూరు, కీలపుడి, అప్పంబట్టు, రామాపురం, బంగాళా తదితర గ్రామాల్లో పూల తోటలు సాగవుతున్నాయి. చెన్నయ్ కోయంబేడు, తిరుత్తణి మార్కెట్లకు నిత్యం ఈ ప్రాంతం నుంచే పూలను బస్సుల్లో పంపిస్తుంటారు. తిరుపతి వయా చెన్నయ్, శ్రీకాళహస్తి వయా చెన్నయ్, నగరి, తిరుత్తని వయా నాగలాపురం వెళ్లే బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు ఈ ప్రాంతంలో పూలను కొనుగోలు చేస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పూల అంగడి ఉండడంతో మాలలు కట్టి అమ్మకాలు చేస్తుంటారు. ఒకప్పుడు చెరకు, వరి, వేరుశనగ పంటలతో నష్టపోయిన రైతన్నకు 'నేనున్నాను' అంటూ పూల సాగు ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. ఏదిఏమైనా పండుగ సీజన్లలో పూల రైతు పంట పండిందన్నమాటే.

మూర రూ.30 అని చెప్పడంతో పూలు సాగు చేశా : వెంకటేశ్వర్లు, రైతు, అడవికండ్రిగ




ఓసారి శ్రీకాళహస్తి దేవాలయానికి వెళ్లి దర్శనం అనంతరం ఇంటికి వచ్చే మార్గంలో పూలు అమ్మడం చూసి ఓ మూర ఎంత అని అడగ్గా రూ.30 అని చెప్పారు. వెంటనే ఇంటికి వచ్చి తరువాత ఒకే నెలలో ఒక ఎకరాలో పూలు సాగు చేశా. గతంలో మూడు ఎకరాల్లో చెరకు పంట పండించేవాన్ని. ఎనిమిదేళ్లుగా చెరకు ఫ్యాక్టరీ లేక చాలా ఇబ్బందులు పడ్డాను. ఈరోజు పండుగ సమయాల్లో 3వేల నుంచి 4వేల రూపాయలు సంపాదిస్తున్నా. ఎంత లేదన్నా నెలలో రూ.30వేల పైనే ఆదారం వస్తుంది.

నా భార్య నేనే పూలు కోస్తాం కృష్ణ, రామగిరి గ్రామం



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో ఒక ఎకరా పొలంలో బాగా దుక్కి దున్ని ఎరువు తోలి గులాబీ మొక్కలు నాటాను. రోజుకు 15 కిలోల గులాబీ పూలు వస్తున్నాయి. ఈ పూలు కేజీ 70-80 రూపాయల ధర పలుకుతోంది. దాదాపు వెయ్యి రూపాయలపైనే ఆదాయం వస్తుంది. పూలు కోయాలంటే ఇద్దరు మనుష్యులు కావాలి. నేను, నా భార్య ఉదయాన్నే పూలు కోసుకుని మార్కెట్‌కు పంపించి అందులో వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.

కోయంబేడు మార్కెట్లో మంచి ధర : బత్తారెడ్డి, పిచ్చాటూరు



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. 3.5 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. మిగిలిన అర్ధ ఎకరాలో కాగడా పూలు సాగు చేస్తున్నాను. ఇవి సంవత్సరంలో ఐదు నెలలు వస్తుంది. ఈ పూలకు చెన్నయ్ కోయంబేడు మార్కెట్లో మంచి ధర పలుకుతుంది. ఈ పూలను ప్యాకెట్ రూపంలో 50-70 ప్యాకెట్లు చేసి కోయంబేడు మార్కెట్‌కు పంపిస్తాం. ఒక ప్యాకెట్ ధర రూ.40-60 వరకూ ఉంటుంది. రోజుకు 3-4వేల రూపాయలు ఆదాయం వస్తుంది. ఏడాదికి మూడు లక్షలపైనే ఆదాయం ఉంటుంది.



2025 వార్షిక సీడీ ఆవిష్కరణ

రాయలసీమకే తలమానికం 'స్విమ్స్'

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాయలసీమకే తలమానికంగా లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతూ మెరుగైన వైద్యం స్విమ్స్‌లో అందుతోందని వక్తలు ఉద్ఘాటించారు. మరో రెండు నెలల్లో శ్రీబయోను అందుబాటులోకి తెస్తామన్నారు. పరిశోధన రంగంలో ఎంతో ప్రగతిని సాధిస్తుందన్నారు. మహతి ఆడిటోరియంలో స్విమ్స్ 32వ వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంచాలకులు, ఉపకులపతి ఆర్‌వి కుమార్, డాక్టర్ అరుణ, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ, ఆర్‌బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా కళావత్ సంయుక్తంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ ఒకేరోజు మూడు రకాల కీలకమైన ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని, ఆ ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. ఎక్కువ డబ్బు ఆర్జించే నైపుణ్యం, శక్తి ఉన్నప్పటికీ శ్రీవారి సంస్థలో పనిచేసి, ప్రజల సేవలో తరించాలన్న గొప్ప ఆలోచనతో స్విమ్స్ వైద్యులు పనిచేస్తున్నారన్నారు. వారి స్ఫూర్తితో వైద్య విద్యార్థులు డబ్బు ప్రదానం కాకుండా పేదలకు సేవలందించేందుకు తమ భవిష్యత్‌ను అంకితం చేయాలన్నారు. స్విమ్స్ నిర్వహణ బాధ్యతను పూర్తిగా టిటిడి తీసుకుందన్నారు. స్విమ్స్ అభివృద్ధికి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.శ్యామల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఐఐటి, ఐసర్, అరవింద ఐ హాస్పిటల్, తిరుపతిలోని అన్ని యూనివర్శిటీలతో ఎం.ఓ.యు లను కుదుర్చుకొన్నట్లు చెప్పారు. అదేవిదంగా యునైటెడ్ కింగ్డమ్ (యు. కె) వారితో స్టూడెంట్స్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్ కుదుర్చుకున్నట్లు తెలిపారు. స్విమ్స్ నందు త్వరలో అప్తామాలాజి, డెంటల్, ఇ. యన్. టి విభాగాల పి. జి కోర్స్ లు అందుబాటులో వస్తాయని తెలియజేసారు. రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ వార్షిక నివేదికను సమర్పించారు. ఆకాంక్ష 2025 వార్షిక సీడీని స్విమ్స్ సంచాలకులు ఆవిష్కరించారు. వైద్య విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 7 మంది వైద్యులకు గోల్డ్ మెడల్, ఎంబిబిఎస్ విద్యార్థినికి 1 గోల్డ్ మెడల్, స్టాఫ్ నర్సు కు గోల్డ్ మెడల్ బహుమతి ప్రదానం చేశారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన విద్యా సాంస్కృతిక, సాహిత్య, క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్. వనజాక్షమ్మ, దంత వైద్య విభాగాదిపతి డాక్టర్ మధుబాబు, కాలేజ్ అఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్. మాధవి పాల్గొన్నారు.

32వ వార్షికోత్సవ సభలో వక్తలు 9 మందికి గోల్డ్‌మెడల్స్



శ్రీకాళహస్తిలో పోటెత్తిన శివభక్తులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'హర హర మహదేవా.. శంభో శంకరా' అంటూ శివనామస్మరణలు, స్వర్ణాభరణాలతో దేదీప్యమానమై వెలుగుతున్న శివపార్వతులను చూసి తరించి పోయే భక్తజనం, స్వర్ణముఖినదిలో పుణ్యస్నానాలు, పితదేవతలకు తర్పణం సమర్పించే భక్తులు, శంఖం పూరించే జంగం దేవరలు, ఇలా ఎటు చూసినా భక్త జన సందోహమే. మహాశివరాత్రి సందర్భంగా సద్యోముక్తి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది.

శ్రీకాహస్తీశ్వర ఆయలంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బుధవారం వాయులింగేశ్వరుడు నిత్యాభిషేక మూర్తియై భక్తులకు దర్శనమిచ్చారు. పండుగ వేళ స్వామి వారికి ఉదయం ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలతో పాటు ఉచ్చికాలాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామివారికి నవాభిషేకాలు చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకుని వేకువ జామున 2 గంటలకే మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య ఆలయ అర్చకులు పవిత్ర మంత్రోచ్ఛరణలు చేస్తూ స్వామివారిని మేల్కొలిపారు. ఉదయం 5గంటల నుంచి 10.30గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకంతో పాటు క్షీరాభిషేకం, పచ్చకర్పూర అభిషేకం, పంచామత అభిషేకం ఒకదాని వెంట ఒకటి స్వామివారికి వరుసగా చేశారు. ఈ అభిషేకాలతో స్వామివారు తన భక్తులకు నిత్యాభిషేక మూర్తిగా తన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి కూడా వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే భక్తులు స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు.


తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం

తిరుమలలోని గోగర్భం సమీపంలో గల రుద్రుని రూపమైన క్షేత్రపాలకుడికి బుధవారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పారు పత్తేదార్ హిమ్మత్ గిరి, ఆర్జితం ఇన్ స్పెక్టర్ పార్థ సారథి పాల్గొన్నారు.

ఇంద్రునిపై ముక్కంటి చిద్విలాసం

ఇంద్రునిపై ముక్కంటి చిద్విలాసం చేశారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజైన బుధవారం ఉదయం స్వామి వారు ఇంద్ర విమానం పైనా, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరం వాహనం పైనా భక్తకోటికి దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు నందిపైనా, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సింహ వాహనం పైనా అధిష్టించి పురవిహారం చేశారు. నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివ, పార్వతులను దర్శించుకోవడానికి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. వాహనాల వెంట సాగిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శివుని దర్శించుకున్న 'కన్నప్ప టీమ్'


శ్రీకాళహస్తిలో 'కన్నప్ప' టీమ్‌తో బొజ్జల సుధీర్‌రెడ్డి

మహాశివరాత్రి పర్వదినాన భక్తకన్నప్ప టీమ్ బుధవారం శ్రీకాళహస్తీశ్వరుడుని దర్శించుకుంది. వీరికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మ వార్లను దర్శనం చేసుకున్న అనంతరం కన్నప్ప టీమ్ మీడియాతో మాట్లాడింది. శ్రీకాళహస్తి స్థలపురాణం నేపథ్యంలో కన్నప్ప సినిమా సాగుతుందని హీరో మంచు విష్ణు తెలిపారు. త్వరలో విడుదల కాబోతున్న ఈ సినిమా శివయ్య అనుగ్రహంతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సినిమా విడుదలకు ముందు శివుడి భక్తుడిగా ముక్కంటిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలియజేశారు. నిర్మాత, నటుడు డాక్టర్ మంచు మోహన్ బాబు పాల్గొన్నారు.

కన్నప్ప టీంకు ఎంజీఎం ఆతిథ్యం

ముక్కంటి దర్శనార్థం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన కన్నప్ప టీంకు స్థానిక ఎంజీఎం గ్రాండ్ హోటల్ ఆతిథ్యమిచ్చింది. ఎంజీఎం సంస్థల అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ గుడ్లూరు మయూర్ కన్నప్ప టీంకు స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు.

శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం శ్రీసిటీలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. భద్రత ప్రతిజ్ఞ చేయించారు. యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాలు నివారించడానికి భద్రత అంశాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే భద్రతా వారోత్సవాల లక్ష్యమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేహంలో తెలిపారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ ఎన్.శేఖర్, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ హెడ్ వై.రమేష్‌కుమార్ పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4న ముగింపు ఉత్సవం ఉంటుందన్నారు.

వృద్ధాశ్రమానికి లయన్స్‌క్లబ్ చేయూత



తిరుపతి టౌన్ : తిరుపతి భవాని నగర్ సర్కిల్‌లో 'ఆదరణ' వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస అధ్యక్షులు ఆర్కాట్ కష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో రెండుమాసాలకు సరిపడా బిస్కెట్లను వితరణ చేశారు. ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో మహాశివరాత్రి పండగ దినాన్ని పురస్కరించుకుని అనాథ వద్ధులకు సేవ చేయడం అదష్టమని భావించారన్నారు. రాబోయే రోజుల్లో వినూత్నమైన సేవా కార్యక్రమాలలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, ఈశ్వర్ రెడ్డి ,శాంతి , శేషాద్రి పాల్గొన్నారు.

నేలపట్టులో సౌత్‌సెంట్రల్ డిఆర్‌ఎం

ప్రజాశక్తి -దొరవారిసత్రం 'విదేశీ పక్షుల నేలపట్టు పక్షుల కేంద్రం ఓ అందమైన ప్రదేశం' అని విజయవాడకు చెందిన సౌత్ సెంట్రల్ డి ఆర్ ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆయన బుధవారం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. చెరువులో విడిది చేసి ఉన్న పలు రకాల పక్షులను ఆయన తన కెమెరాలో బంధించారు. ఎక్కడో వేల మైళ్ళ దూరం నుండి ఇక్కడకు చేరి పొదిగి వాటి పిల్లలతో తిరిగి వెళ్లడం మహా అద్భుతమని అన్నారు. పర్యాటక కేంద్రంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. లోపల ఉన్న అన్నింటిని పరిశీలించారు. రాబోవు రోజుల్లో ఈ పక్షుల కేంద్రానికి ఎంతో గుర్తింపు కూడా వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీనియర్ డీన్ కష్ణ, ఏ డి ఇ ఎన్, గూడూరు రైల్వే ఎస్సై లీలా కష్ణ పాల్గొన్నారు.


న్యాయశాస్త్రంలో టి.వినీలకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని టి.వినీలకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల డీన్ ఆచార్య జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్ర విభాగపు ఆచార్యులు కాణిపాకం సునీతా పర్యవేక్షణలో ' సైబర్ ఫోరెన్సిక్స్ ఆన్ ఈ-బ్యాంకింగ్ ఇన్ ఇండియా - ఏ సోషియో లీగల్ స్టడీ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు.

'టౌన్‌బ్యాంక్' లోనూ 'మంతనాలు'
ఇద్దరు డైరెక్టర్లు ఇప్పటికే జనసేనలోకి..



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైసీపీ పార్టీ నుంచి చేజారిపోయే పరిస్థితి కనబడుతోంది. ఇప్పటికే ఇద్దరు డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్ రాయల్ జనసేన పార్టీ కండువాను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో కప్పుకున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టిడిపి కార్పొరేటర్ ఆర్ సి మునికష్ణ గెలుపొందిన విషయం తెలిసిందే. పనిలో పనిగా తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌నూ కైవసం చేసుకునే ఆలోచనలో కూటమి ఉంది. టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం రామారావుతో పాటు, వైస్ ఛైర్మన్ వాసు యాదవ్‌తో పాటు 11 మంది డైరెక్టర్లు ఉన్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు వైసిపి పార్టీ చెందిన వారే అధికారంలో ఉంటున్నారు. తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ పదవిపై టిడిపి మాజీ ఛైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే అప్పట్లో డైరెక్టర్లను టిడిపిలో చేర్చుకోడానికి సుముఖత రాలేదు. వైసిపి ఛైర్మన్ కేతం రామారావును గద్దె దించాలంటే కూటమికి ఏడుమంది డైరెక్టర్లు అవసరం. ఏడుగురిలో ఇద్దరు జనసేనలో చేరారు. మరో ఐదుగురు కావాల్సి ఉంది. ఇందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. వీరు కూడా త్వరలోనే కూటమిలో చేరే అవకాశాలు ఉన్నాయి. అయితే ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లలో టిడిపికి, జనసేనకు ఏది ఇస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. వైసిపి నుంచి వలసొచ్చిన వారిలో ఒకరికి ఛైర్మన్‌గానీ, వైస్‌ఛైర్మన్ గాని ఇవ్వాల్సి ఉంటుంది. కూటమిలో చేరే డైరెక్టర్లు పదవీకాలం కొనసాగే వరకూ తమను ఉంచాలని, ఎన్నికలు వద్దన్నది వారి వాదన. ఏదిఏమైనా ఐదుగురు డైరెక్టర్లుతో మంతనాలు ఒక ఎత్తయితే, ఛైర్మన్ పదవి టిడిపికా, జనసేనకా అన్నది కూడా తేలాల్సి ఉంది.

భద్రతా ప్రమాణాలు పాటించని..
మినరల్ 'మాయాజాలం'



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'శివరాత్రి'కి చలి 'శివశివా' అంటూ వెళ్లిపోతుందన్నది 'సీజనల్' నానుడి.. ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండటం ప్రారంభించింది.. ఇంకో రెండు రోజుల్లో మార్చి నెల వచ్చేస్తుంది.. గ్రీష్మతాపం మొదలయ్యింది. నీళ్ల వ్యాపారులు నాలుగైదు నెలల పాటు లాభాలను దండుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో నిత్యం 16 లక్షల లీటర్ల నీటి అమ్మకాలు జరుగుతుంటాయి. ప్రతి నెలా రూ.4.80 కోట్ల నీటి వ్యాపారం నడుస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.30-40 కోట్ల పైనే నీళ్ల వ్యాపారం జరుగుతుంది. అయితే చాలాచోట్ల భద్రతా ప్రమాణాలు పాటించకుండానే మినరల్ క్యాన్లలో నీటిని నింపేస్తున్నారని, 'బిఐఎస్' మార్కు తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేదంటే వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తాం' అని కార్పొరేషన్ ఆరోగ్య అధికారి యువ అన్వేష్ నీటి వ్యాపారులను హెచ్చరిస్తున్నారు. ఆరోగ్య ప్రమాణాలతో తెలుగుగంగ నీటిని ఫిల్టర్ చేసి మరీ నగరంలో పంపిణీ చేస్తున్నా, 90 శాతం ప్రజలు మినరల్ క్యాన్లపైనే ఆధారపడి, నెలకు 300-600 పైనే తాగునీటికి తమ బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తుండటం గమనార్హం. పట్టణాల్లో ట్రేడ్‌లైసెన్స్ తీసుకుని, అక్రమ నీటివ్యాపారం సాగిస్తుండటం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో దాదాపు 30 లక్షల పైనే జనాభా ఉంది. ఒక్కో మనిషి రోజుకు మూడు నుంచి ఐదు లీటర్ల నీళ్లను తాగాలి. ఎక్కువ మంది మినరల్ క్యాన్లపైనే ఆధారపడి తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. చాలాచోట్ల ట్రేడ్‌లైసెన్స్ తీసుకుని, ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా, క్యానుల్లో సాధారణ జలాన్నే నింపేస్తున్నారన్న విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. కలుషిత నీటితో వచ్చే అతిసార, జీబీఎస్ వ్యాధులు జిల్లాలో కలవర పెడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బార్లు, రెస్టారెంట్లలో మద్యం ప్రియులు ఎక్కువగా ప్యాకెట్ నీటిని వాడుతూ ఉంటారు. ఇటీవల నగరంలో ఆహార నియంత్రణ అధికారులు తనిఖీ చేయగా, తాగునీటి ప్యాకెట్లపై తయారీ, కాలపరిమితి తేదీలే ముద్రించకపోవడం గమనార్హం. అపరిశుభ్రత మధ్యే నీటిశుద్ధి ప్రక్రియ చేపడుతున్నారు. నిర్వాహకులు కనీసం లైసెన్సులను రెన్యువల్ చేసుకోకపోవడం గమనార్హం. చిన్నచిన్న గల్లీల్లో అపరిశుభ్ర వాతావరణంలోనే వాటర్‌ప్లాంట్లు నడుస్తున్నాయన్నది 'ప్రజాశక్తి' పరిశీలన. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ప్యాకేజి డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు, వేలకొద్దీ మినరల్ వాటర్ ప్లాంట్లు కలిపి ఐదువేల వరకే ఉన్నట్లు అంచనా. డబ్బాలను ఎప్పటికప్పుడు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రం చేయాల్సి ఉంది. అయితే రోజులు, నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. పాచిపట్టిన డబ్బాల్లోనే నీటిని నింపి విక్రయిస్తున్నారు. దాదాపు 14 మార్గదర్శకాలు పాటించాల్సి ఉండగా అరకొరగానే పర్యవేక్షణ ఉంటోంది. వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతులు తప్పనిసరి. మైక్రోబయాలజీ, కెమిస్ట్ అర్హత ఉన్న వారిని ల్యాబ్ టెక్నీషియన్‌గా నియమించాలి. నిత్యం ఉదయం, సాయంత్రం నీటిని పరీక్షించి పిహెచ్ స్థాయి 10కి తగ్గకుండా, కాల్షియం, మెగ్నీషియం మొతుదును గమనించాలి. కేంద్రంలో ప్రతి పదివేల లీటర్ల నీటికి ఒకసారి ఫిల్టర్‌ను మార్చాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.40కోట్ల బిజినెస్

నీళ్లప్యాకెట్లు అమ్మితే చర్యలు : డాక్టర్ యువ అన్వేష్, కార్పొరేషన్ ఆరోగ్య అధికారి

నగరంలో నీళ్ల ప్యాకెట్లు అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. కార్పొరేషన్ పరిధిలో నీళ్ల ప్యాకెట్ల అమ్మకాలు నిషేధం ఉంది. మినరల్ వాటర్ అమ్మకాలు చేసేవారు బిఐఎస్ మార్కు కలిగి ఉండాలి. లేదంటే ఆ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తాం. ప్రజలకు నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలి. నాశిరకం ఉంటే చర్యలు తీసుకుంటాం.




ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓజిలి : ఆటోడ్రైవర్ పొట్టూరు పెంచలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు ఆర్థిక సాయం అందించారు. ఓజిలికి చెందిన ఆటో డ్రైవర్ పెంచలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సిఐటియు ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. పెంచలయ్య మృతి విషయం తెలుసుకున్న తోటి ఆటో కార్మికులు ఒక రోజు తమ వంతు సహాయంగా ఆటో డ్రైవర్ భార్య , పిల్లలకు నాలుగు వేల మూడు వందల రూపాయలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్కె మహబూబ్ బాషా, కమిటీ సభ్యులు ఎస్కే. ఇస్మాయిల్, పి శ్రీనివాసులు, ఎస్కే జంషిద్ అహ్మద్, ఎం నాగూర్ బాబు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శివరాత్రి సందర్భంగా పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వడమాలపేట మండలం ఓబిఆర్ కండ్రిగ, ఉమామహేశ్వల ఆలయం వద్ద బుధవారం కంటి, దంత వైద్యం నిర్వహించారు. వాసన్ ఐ కే ర్ హాస్పిటల్, డాక్టర్ షౌకత్‌ఆలీ , పిఆర్‌ఓ వెంకటేష్, జగదీష్, విజయ మల్టీ డెంటల్ హాస్పిటల్ తిరుపతి డాక్టర్ దనీష్ అంకన్న, డాక్టర్ విజయలక్ష్మి క్యాంపు నిర్వహించారు. 175 మంది రోగులకు ఉచిత పరీక్షలు చేసి మందులు అందించారు. 45 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. దంత పరీక్షలు చేసి వారికీ ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు త్యాగరాజు, కార్యదర్శి శివరామరాజు , ఆలయ సభ్యులు, వివిధ ప్రాంతాల భక్తులు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కోనేటి రవిరాజు, వైస్ ప్రసిడెంట్ చంద్రబాబు, కార్యదర్శి రామ్మోహనవర్మ, కోశాధికారి రమేష్ రాజు. సభ్యులు సుధాకర్, మోహనరాజు, వాకర్స్ అసోసియేషన్ తడుకు రైల్వే స్టేషన్ అధ్యక్షులు రామచంద్రరాజు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపులో పాల్గొన్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు

ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పర్యటక కేంద్రమైన ఉబ్బలమడుగు లో (అవంతి కోన) వెలసిన సిద్దేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. వీరికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించింది. పలువురిని పరీక్షించి వైద్య సేవలు అందించారు. క్యాంపులో సభ్యులు సౌత్ ఇండియా ఆర్గనైజర్ డాక్టర్ బి జె కిషోర్ కుమార్ , డాక్టర్ సురేష్ కుమార్, సత్యవేడు నియోజకవర్గ చైర్మన్ సుధీర్ బాబు, సత్యవేడు ఆర్గనైజర్ డాక్టర్ భాను ప్రసాద్ పల్గొన్నారు. క్యాంపునకు సహకరించిన ఫారెస్ట్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి , ఎఎన్ఎం,ఆశా వర్కర్లు, వాలంటీర్స్ కి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.


ఆలయ ఆర్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ఆలయ ఆర్చి ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ఈసలాపురం గుట్టపై వున్న ఆలయానికి వెళ్లే ముఖ ద్వార ఆర్చిని ఇటీవల నూతనంగా నిర్మించారు. ఈ ఆర్చిని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత అబ్బూరు శ్రీనివాసులు మాట్లాడుతూ పుత్తూరుకు చెందిన దాతలు తన తల్లిదండ్రులు ఎద్దురు విజయగోపాల్ శెట్టి, తల్లి కోకిలమ్మ జ్ఞాపకార్ధం తన కుమారులు ఎబ్బూరు శ్రీనివాసులు, ఆయన సోదరులు సహకారంతో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో ఆర్చిని నూతనంగా నిర్మించారు. తల్లిదండ్రుల ఆశయాల మేరకు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివానంద స్వామి, కన్నయ్య రాజు, రమణ రాజు, సుబ్రహ్మణ్యం యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడి పూతకు మంచు పురుగు దెబ్బ

ఉద్యాన శాఖ అధికారిణి యామిని

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కొద్ది రోజులుగా కురుస్తున్న తేనే మంచు ప్రభావంతో వచ్చే పురుగు వల్లే మామిడి చెట్లలో పూత రావటం లేదని మండల ఉద్యాన శాఖాధికారిణి యామిని పేర్కొన్నారు. ఆమె గురువారం కన మనం బేడు, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామా ల్లోని మామిడి తోటలను పరిశీలించి, రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురవటంతోపాటు మంచు ఎక్కువగా ఉండటంతో మామిడి చెట్లలల్లో పూత రాలేదని తెలిపారు. మామిడిలో పూత రావటం కోసం ఒక లీటరు నీటిలో మల్లికే మందు కలిపి పిచికారి చేస్తే పూత ఒక్కసారిగా వస్తుందన్నారు. తేనే మంచు నివారణకు ఇమ్రోఫెజిన్ ను నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పూత తర్వాత వచ్చే చీడపీడలకు పలు రకాల మందులను పిచికారీ చేస్తే సరిపోతుం దన్నారు. తామర పురుగు నివారణకు ఫ్రూట్ కవర్స్ ని వాడాలని తెలిపారు. వివరాలకు సెల్ 7995086941 నెంబరుకు ఫోన్ చేస్తే మామిడి, మిరప పంటల సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు.


మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారిణి యామిని

మెరుగైన సేవలు అందించాలి

- విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర పాటిల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర పాటిల్ రైల్వే సిబ్బందిని ఆదేశించారు. గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. ప్రయాణికుల వసతులు, ఆఫీసు కార్యాలయ భవనాలను పరిశీలించారు . సిగ్నలింగ్ వ్యవస్థ , ఫ్లాట్ ఫాం ప్రయాణికుల వసతులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూ రయ్యాయని ప్రయాణికులకు అవసరమైన వసతులపై ప్రతిపాదనలు పంపించాలని రైల్వే సిబ్బందిని ఆదేశించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిం చాలని సూచిం చారు. ఆయన వెంట స్టేషన్ సూపరిండెంట్ వెంకటేశ్వర రావు , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న రైల్వే డిఆర్ఎం నరేంద్ర పాటిల్

కామాక్షి సదాశివేశ్వరుని దర్శించుకున్న రోజా


స్వాగతం పలుకుతున్న ఆలయాధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలో, నాగిలేరు వద్ద వెలసిన కామాక్షి సదాశివేశ్వరుని ఆలయాలను మాజీ మంత్రి ఆర్కే రోజా బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు కమిటీ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. స్థానిక వైసీపీ నేతలు, ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్లు డి జయప్రకాష్, డిశంకర్, రవీంద్ర కేటి ప్రసాద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట: మహా శివరాత్రి సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం దంపతులు నాయుడుపేట విన్నమాలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అన్నదానం నిర్వహించారు.

సత్యవేడు: శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భారీగా భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో 'రుద్రాక్ష వృక్షం' వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకం, అర్చన, వేదమంత్ర పారాయణ పూజలు నిర్వహించారు. ట్రిపుల్ ఐటి, క్రియా యూనివర్సిటీ విద్యార్థులు సామూహిక భజనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. శ్రీసిటీ సోషియల్ ఇన్‌ఫ్రా విభాగానికి చెందిన అవినాష్ వేడుకల నిర్వహణను పర్యవేక్షించారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.



నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో గౌరీ సమేత భూపతేశ్వర స్వామి నగరోత్సవం మహా వైభవంగా నిర్వహించారు. గురు స్వామి కొప్పోలు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గౌరీ సమేత భూపతేశ్వర స్వామి నగరోత్సవం జువ్వలపాలెం గ్రామం నుండి బయలుదేరి నాయుడుపేట, పుదూరు, అత్తలపాలెం,పాటిమిట్ట మీదుగా చిట్టమూరు మండలంలోని ఏకశిరి తిప్పపై వెలసిన గౌరీ సమేత భూపతేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుంది. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణం శివాలయంలో, త్యాగరాజ వీధిలోని సోమేశ్వరాలయంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మీనాక్షీ సమేత సోమేశ్వర స్వామి కి మహాశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింగరావుపేట ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ్య విశ్వవిద్యాలయ కార్యాలయంలో 89వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలు నిర్వహించారు. నవరత్నల అభిషేక రుద్రాక్ష శివలింగాలను ఏర్పాటు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం రామగిరి శ్రీ వాలీశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రామగిరికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ లత సాధరంగా స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ కాళభైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అనంతరం మూలవిరాట్ వాలీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఈఓ లత ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలు చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, ఆయకట్టు ఛైర్మన్ రవి, వాసు రెడ్డి, ఏకాంబరం, సుమాజిలి, రజిని, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలు నాలుగవ రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున శ్రీ సిద్దేశ్వరి సమేత సిద్ధేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ఉదయం ఐదు గంటలకు స్వామి అమ్మవార్ల సర్వదర్శనం భక్తులకు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సిద్దేశ్వర స్వామి వారి సర్వ దర్శనం, కల్యాణోత్సవం, రాత్రి 7 గంటలకు సిద్దేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణతో ఊరేగించారు. అర్ధరాత్రి లింగోద్భ పుణ్యకాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రా భిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించినట్లు కార్య నిర్వహణ అధికారి రవీందర రాజు తెలిపారు. భక్తులకు ఉచితంగా తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానాలు చేశారు. తలకోనకు విచ్చేసిన భక్తులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, పెరుగన్నం, తాగునీటిని ఉచితంగా మండల కూటమి నాయకులు పంపిణీ చేశారు.

నాగలాపురం: నాగలాపురం మండలం సురుటుపల్లిలో పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుకుల్ ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈఓ లత ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.


ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు

తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని జంబుకేశ్వర స్వామి, తిరుమల నగర్ ఈశానేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆ ఆలయాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సారే సమర్పించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శి గోపీనాథ్, మధు, ఈశ్వరయ్య, స్థానిక టిడిపి నాయకులు గోవిందరాజులు, చంద్ర, పట్టాభి, జనార్ధన్, ఏవిఎం శ్రీనివాసులు, హరి, రాధాకృష్ణ, హరిప్రసాద్, సహదేవ, ప్రహ్లాద, రోసిరెడ్డి, మేఘనాథ్, సురేష్ నాయుడు టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం లోని సిద్దలయ్య కోన ఉబ్బల మడుగు లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ, చలపతి సర్పంచ్ తిరుపాలు భక్తులకు ప్రసాదలు పంపిణీ చేశారు. స్వామికి లడ్డూలను నైవేద్యం పెట్టి భక్తులకు పంచారు. ఈ కార్యక్రమం లో చుట్టుపక్కల గ్రామస్తులు, శివ భక్తులు కల్కి ట్రస్ట్ లోకేష్ దాసజి, మునీంద్ర, సాయి, తలారి కస్తూరయ్య, బొగ్గుల రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

క్యాంపస్ : తిరుపతి మంచినీళ్ల కుంట వద్ద శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు, స్థానిక శివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు సూర్యనారాయణ శర్మ, సుబ్రహ్మణ్యస్వామి పాల్గొన్నారు.

క్యాంపస్ : వేదవిశ్వవిద్యాలయ ఆవరణలో ధ్యానారామంలో వేంచేసి ఉన్న శ్రీబృహదీశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవం ఉమా సహిత బృహదీశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత రుద్రకుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను విశ్వవిద్యాలయ అధికారులు పర్యవేక్షించారు. అభిషేక కార్యక్రమాల్లో ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, కుల సచివులు పి భాస్కర్, డీన్ గోలి సుబ్రమణ్య శర్మ, వేద విశ్వవిద్యాలయ పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : మండలంలో శివాలయాలలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ జలకంఠేశ్వర స్వామి, కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర నాటికల మండలి ఆధ్వర్యంలో ద్రౌపదీ మాన సంరక్షణ పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. చెక్కల భజనలు, కోలాటాలు, భజనలు , హరికథ కాలక్షేపాలు నిర్వహించారు. శివాలయాలు వద్ద స్థానిక ఎస్సై రామాంజనేయులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీ జలకంఠేశ్వర స్వామికి తహశీల్దారు కే వెంకటరమణ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



మసీదుల కమిటీ అధ్యక్షుడుగా అబ్దుల్ రహీం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వాకాడు జామియా మసీదులో గూడూరు నియోజకవర్గం లోని పలు మసీదుల అధ్యక్షులు సమావేశమై గూడూరు నియోజకవర్గ మసీదుల కమిటీ అధ్యక్షుడు (ముత్తవలి)గా గూడూరు పట్టణానికి చెందిన ఎండి అబ్దుల్ రహీమ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మసీదుల కమిటీ సభ్యులు, పెద్దలు నూతనంగా ఎన్నికైన అబ్దుల్ రహీంను, ఇతర కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రహీం మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని ముస్లింల సమస్యలు, మౌజన్, ఇమామ్ లు జీతభత్యాల గూర్చి నియోజకవర్గంలోని మండల కేంద్రాలలో షాదీ మంజిల్‌ల నిర్మాణానికి, వాటి అభివృద్ధికి, ఖబరస్తాన్లు లేని చోట ఖబరస్థాన్ల ఏర్పాటుకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ప్రసిడెంట్ గా కోట పట్టణానికి చెందిన మస్తాన్ బాష, జనరల్ సెక్రెటరీగా గూడూరుకు చెందిన జిలాని బాష, సెక్రటరీగా వాకాడు కు చెందిన అమీర్ బాష, జాయింట్ సెక్రటరీగా ఉడత వారి పాలెం కు చెందిన అమీరుద్దీన్ , ట్రెజరర్ గా జమీర్ భాయ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు


స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ పుత్తూరు, సమీప దేవాల యాల భక్తులకు విశిష్ట సేవలు అందించారు. ముఖ్యంగా పుత్తూరు శివాలయంలో50 మంది స్కౌట్ అండ్ గైడ్స్ భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లలో సక్రమంగా వెళ్లేందుకు, ఎలాంటి తోపులాట, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా సేవలు అందించారు. అన్నదానం, ప్రసాదం వితరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్యపాత్ర వహించారు. ప్రత్యేకంగా భక్తులకు సేవలను అందించారు. తోరూరు శివాలయం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు 50 మంది సేవలందించారు. నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే భాను ప్రకాష్ ఈ సందర్భంగా వారిని అభినందించి చదువుతున్న స్కూలు వివరాల తెలుసుకొని ప్రతి విద్యార్థి దశలోనే సేవాభావం పెంచుకోవాలని అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ గోపి, అశోక్ కుమార్ ,గైడ్ కెప్టెన్ రెడ్డి రాణి ,సునీత, రాధిక, గైడ్స్ లీడర్ ఎస్ దివ్యశ్రీ, కవిత, యువ శ్రీ , శైలజ, రోవర్ లీడర్ జయ కుమార్, మహీధర్ పుత్తూరుకు సంబంధించిన జడ్పీ హైస్కూలు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళుతున్న సమయంలో మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటన నారాయణవనం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. నారాయణవరం మండలం వెత్తల తడుకు గ్రామానికి చెందిన అఖిల్ (18) స్థానిక సిద్ధార్థ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శివరాత్రి కావడంతో కైలాస కోనకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి ఇంటికి బయలుదేరాడు. పడివేటమ్మ ఆలయం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద వళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో కింద పడ్డ అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. గాయపడిన అఖిల్‌ను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా తలకోనకు వెళ్లిన యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కోడూరుకు చెందిన అఫ్జల్ (28) ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ప్రమాద వశాత్తు డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సాయంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన 108 ద్వారా ప్రథమ చికిత్స అందజేసి తిరుపతి రుయాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బార్ వద్ద వ్యక్తి వీరంగం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి లీలామహల్ సమీపంలోని అమెరికన్ బార్ వద్ద ఫుల్లుగా మద్యం తాగి వ్యక్తి వీరంగం సృష్టించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. తాగిన మత్తులో తెల్లవారి జామున మూడు నాలుగు గంటల మధ్య వీరంగం సృష్టించాడు. విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పై తిరగబడ్డాడు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన కానిస్టేబుల్ చొక్కా పట్టుకుని, స్టేషన్ కిటికీ అద్దాలు ధ్వంసం చేశాడు. నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాల్సి ఉండగా పోలీసులు రాజకీయ ఒత్తిడులతో కేసును సైతం రద్దుచేసి వదిలిపెట్టడం గమనార్హం.

టాస్క్ ఫోర్స్ దాడులు

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిధిలోని మార్లపూడి ఫారెస్ట్ వద్ద దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద ఆధీనంలోని ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం స్థానిక ఎఫ్ఆర్వో మాన్యాద్రి, ఎఫ్‌బివో మహేష్ తో కలిసి నెల్లూరు జిల్లా ఫారెస్ట్ డివిజన్ పరిధిలో మంగళవారం కూంబింగ్ చేపట్టా రన్నారు. బుధవారం తెల్లవారుజామున రాపూరు మండలం, గండూరు పల్లి సమీపంలో కొంతమంది వ్యక్తులు రెండు మోటార్ సైకిల్ పై ఆగి ఉండడాన్ని గమనించి, వారిని సమీపిస్తుండడంతో వారు పారిపోయే యత్నం చేశారని వారిని వెంబడించి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, రెండు మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసు కున్నామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో ఎస్సై రఫీ నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పారిపోయిన వారికోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.


సమస్యను పరిష్కరించడంతో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజలు

విద్యుత్ లైన్ల మార్పు

సమస్య పరిష్కారంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్లపై విద్యుత్ లైన్ల సమస్యను ఎమ్మెల్యే స్పందించి పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు దళితవాడ వాసులు కృతజ్ఞతలు తెలుపు కున్నారు. చెన్నూరు మొదటి హరిజనవాడలో ఎన్నో సంవత్సరాలుగా ఇళ్ల మీద 11కేవీ విద్యుత్ లైన్లు వెళుతుండడంతో కనీసం ఇల్లు కూడా కట్టుకోలేక స్థలాలు ఖాళీగా వదిలి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ద్వారా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించారు. చెన్నూరు మొదట హరిజనవాడ ప్రజలు ఎమ్మెల్యే ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి చెన్నూరు. కృష్ణమూర్తి, బూత్ కన్వీనర్ కోలా అశోక్ స్థానికులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI
O.S.No. 610 of 2024
K.Madhusudhan Reddy ...Plaintiff
V/s
K.Munemma and others ...Defendants
Suit summons to the Defendants Nos. 1 to 3
1. K.Munemma W/o Late K.Chenna Reddy, 2. K.Kumar Raja Reddy S/o Late K.Chenna Reddy 3. K.Bhumika D/o Late K.Chenna Reddy
Defendants 2 and 3 are minors under the Care and custody of their mother/Natural guardian K.Munemma i.e., first defendant and Defendants 1 to 3 are residents of Old D.No.4-1, New D.No.1-171, Mallaiahpalle Village, Dornakambala Post, Chandragiri Mandal, Tirupati District.
Please take suit summons that in the above suit filed by the plaintiff against you are posted to **04-04-2025** for your appearance before the above court. If you got any objections, attend the above court on the above date at 10-30 a.m. and file the same. Failing which the matter will be decided exparte.
HEARING DATE: 04-04-2025
D.JAYACHANDRA
ADVOCATE TIRUPATI

దోమలు స్వైర విహారం

- ఇళ్ల స్థలాల మధ్య పిచ్చిమొక్కలు
- పారిశుద్ధ్య లోపం
- పట్టించుకోని అధికారులు
- ప్రజల్లో జ్వరాల భయాందోళన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రజలు స్థలాలను కొనుగోలు చేసుకున్నారు. కనీసం ఏడాదికి ఒకసారి కూడా వచ్చి చూసుకోని పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో ఆయా ఖాళీ స్థలాల్లో చెట్లు పిచ్చి మొక్కలు పెరిగి చుట్టుపక్కల వారికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. చెత్త కూడా అదే ప్రాంతంలో వేయడంతో దుర్వాసనతో నివాసితులు వ్యాధులు బారిన పడుతున్నారు. చెట్లు, గుబురుగా పెరగడంతో విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల మధ్య దోమలు తీవ్రత అధికమై కంటి మీద కునుక లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల్లో పారిశుధ్య లోపం

మండలంలోని ఈ బీసీ దాస్ కాలనీ, మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు ఏపుగా వ్యాపించాయి. పారిశుధ్యం పూర్తిగా లోపించడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. వచ్చే సంపాదన అంతంత మాత్రంగా ఉంటే దానికి తోడుగా వ్యాధులు బారినపడి వైద్యఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ముళ్ల చెట్లు పెరిగినా పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో స్థలాల యజమానులు మౌనంగా వుంటున్నారు. స్థలాల ధరలు బాగా పెరిగి స్థల యజమానులు లబ్ధి పొందుతున్నారు. పంచాయతీ అధికారులు ప్రజారోగ్యాన్ని పరిరక్షణలోకి తీసుకోవడం లేదు. కనీసం ఖాళీ స్థలాలకు పన్నులు కూడా చెల్లించని పరిస్థితి ఏర్పడింది. అధికారులు నిత్యం ఆయా ప్రదేశాల్లో తిరుగుతున్నా కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు స్థల యజమానుల చిరునామాలు తెలుసుకొని వారికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా వారు కూడా వాటి విషయమై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో దృష్టి పెట్టాలి..

ఈ బీసీ దాస్ కాలనీ, మరికొన్ని ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ ప్రాంతాలలో ఖాళీ స్థలాల్లో గుబురుగా చెట్లు పెరగడం వల్ల చుట్టుపక్కల నివాసతులకు అసౌకర్యంగా ఉంటుంది. కొన్ని చోట్ల ఖాళీ స్థలాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారాయి. మండల సంస్థ విభాగం అధికారుల ఖాళీస్థలాల యజమానులను గుర్తించి ఆయా స్థలాలను శుభ్రం చేయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

విషపురుగుల బెడద

ఖాళీ స్థలాల్లో గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రాత్రి సమయంలో తేళ్లు, పాములు వంటి విష పురుగులు రోడ్డు మీదకు వస్తున్నాయి. పిల్లలు పాఠశాల ట్యూషన్ల నుంచి వచ్చేటప్పుడు భయపడుతున్నారు., శ్రీ సిటీ లాంటి అనే కంపెనీలకు నిత్యం వందలాది మంది కార్మికులు అర్ధరాత్రి, తెల్లవారు జామున వెళ్లి వస్తుంటారు. వారు ఎలాంటి విషపురుగుల బారిన పడకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI
I.A.NO : 62 of 2023
A.S.NO: of 2018
O.S.NO : 60 of 2008
M.Radhakrishnama Naidu & another
... Petitioners / Appellants / Plaintiffs
Vs.
R.Umapathi Reddy, S/o. Late R.Rama Krishna Reddy & 2 Others
...Respondents / Respondents / Defendants
NOTICE TO RESPONDENT /RESPONDENT/DEFENDANT-NO.3
R.3: P.Sudhakar Reddy, S/o Venkata Reddy, Real Estate Business, residing at: D.No: 106 A, Ashok Apartments, P.K.Lay-out, Tirupati City, Tirupati Urban Mandal, Tirupati District.
Please take notice that the above petition stands posted to 28.02.2025 for your appearance. You are therefore directed by the above said Hon'ble Court to appear before the Hon'ble Court on 28.02.2025 at 10.30 AM and represent the matter either in person or through your advocate. Failing which the matter will be decided exparte.
By order of the Court
Sd/- T. MOHAN MURALI,
Advocate, TIRUPATI. **Cell: 9848424089**

IN THE COURT OF JUDGE OF FAMILY COURT -CUM- V ADDL. DISTRICT JUDGE, TIRUPATI
Crl. M.P. No. 163 / 2024
M.C. NO. 32 / 2009
Between:
1. T.Malleswari,
2. T.Mahitha, minor, rep. by her mother / Natural guardian T.Malleswari (1st petitioner)
...Petitioners / Petitioners
And :
T.Gopi Reddy **...Respondent / Respondent**
NOTICE TO THE RESPONDENT
To
T. Gopi Reddy,
S/o Late T.Ramamurthy Reddy,
D.No. 4-4-800/A, Nehru Nagar,
Tirupati Urban & District.
Please take notice that the above petitioners filed the above petition against you for realization of the arrears of maintenance amount and the matter is posted for your appearance before the above said Hon'ble Court on 12.03.2025 at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear on that day the matter will be decided in your absence as ex-parte.
Hearing Date: 12.03.2025
Time: 10:30AM.
(By Order of the Court)
M.N. MANI, B.A.L., B.L.,
Advocate for Petitioners / Petitioners